

రామోజీ ఫిలింసిటీ ముట్టడిలో భాగంగా పేదల ప్లాట్ల వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు, లబ్ధిదారులు

రామోజీ ఫిలింసిటీ గేటుపైకి ఎక్కి దూకుతున్న సీపీఎం కార్యకర్తలు, ప్లాట్ల లబ్ధిదారులు

రామోజీ ఫిలింసిటీ ముట్టడి ఉద్రిక్తం

- ఆక్రమించిన స్థలాలు పేదలకు తిరిగిచ్చేయాలని సీపీఎం ఆందోళన
- పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట.. పలువురికి గాయాలు
- జాన్‌వెస్లీతో పాటు మరో 29 మంది నేతలపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, మార్చి 26: సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన రామోజీ ఫిలింసిటీ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి యాదయ్య నేతృత్వంలో వందల మంది నాయకులు, కార్యకర్తలు నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు రామోజీ ఫిలింసిటీకి ర్యాలీగా బయలుదేరారు. విషయం తెలియటంతో పోలీసులు ఫిలింసిటీ ప్రధాన గేటు వద్ద మోహరించారు. దీంతో సీపీఎం కార్యకర్తలు గేట్లపై నుంచి దూకి లోపలికి వెళ్లారు. అక్కడ గుడిసెలు వేయటానికి ప్రయత్నించారు. చర్చల ద్వారా సమస్య పరిష్కరిస్తామని, బయటకు వెళ్లిపోవాలని పోలీసులు చెప్పినప్పటికీ వారు వినిపించుకోలేదు. అనంతరం నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించగా.. సీపీఎం కార్యకర్తలు, లబ్ధిదారులు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అతికష్టం మీద సీపీఎం నాయకులు, కార్యకర్తలను అక్కడి నుంచి తరలించారు.

పేదల భూములు తిరిగివ్వాలి: జాన్‌వెస్లీ

పేదల భూములను వారికి తిరిగి ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామోజీ ఫిలింసిటీ వెనుకగేటు వద్ద నాగన్‌పల్లి పరిధిలోని సర్వే నంబర్ 80లో సుమారు 30 ఎకరాల భూమిని రాయపోల్, పోల్కంపల్లి, ముకునూరు, నాగన్‌పల్లికి చెందిన సుమారు 500 మంది నిరుపేదలకు 2007లో అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ భూముల చుట్టూ రామోజీరావు ప్రహరీ నిర్మించి పేదలు లోపలికి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పేదల ఇండ్ల స్థలాలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 2007 నుంచి సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగుతున్నదని తెలిపారు. పేదల ఆందోళనను పట్టించుకోకుండా ఆ భూముల్లో స్టూడియో నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. రామోజీరావు ఆక్రమించిన భూమి విషయంలో ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే పేదల ఇండ్ల స్థలాలను వారికి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

29 మందిపై కేసులు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, పలువురు జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు, మరో 29 మందిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిని అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసులు అరెస్టుచేసిన వారిలో నాయకులు కాడిగల్ల భాస్కర్, బోడ సామేల్, జగదీశ్, కందుకూరి జగన్, పంది జగన్, బుగ్గ రాములు, వెంకటేశ్, జంగయ్యతో పాటు పలువురు లబ్ధిదారులు ఉన్నారు.

పోరాటం ఆగదు: పగడాల యాదయ్య

పేదల భూముల్లోకి రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం రానివ్వడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య ఆరోపించారు. ప్లాట్లు అప్పగించే వరకు పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. అక్రమ అరెస్టులకు నిరసనగా గురు, శుక్రవారాల్లో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

రామోజీ యాజమాన్యంపై కేసు పెట్టాలి

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలు, రోడ్లు, 350 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న రామోజీ ఫిలింసిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాల్లో ఇండ్లు నిర్మించుకోవడానికి వెళ్లిన పేదలు, వారికి మద్దతుగా వెళ్లిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు జిల్లా నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేదలకు 2007లో అప్పటి సర్కారు ఇచ్చిన పట్టా భూముల్లో అడుగు పెట్టిన 75 మందిపై గతంలో అక్రమ కేసులు పెట్టి ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం తిప్పిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, పోలీసులు రామోజీ సంస్థకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రామోజీ సంస్థ ఆక్రమించిన 350 ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకుని గుడిసెలు వేసే కార్యక్రమానికి పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జీతమిస్తే దవాఖానకు పోతా!

- సారూ జ్వరమొచ్చిందంటూ అధికారుకు వినతి
- ఎంపీడీవో కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికుడి ఆవేదన
- ఆరునెలలుగా జీతాలు లేవని కన్నీరు పెట్టిన వైనం

వికారాబాద్, మార్చి 26 : సారూ.. జ్వరం వచ్చింది... డబ్బులు ఇస్తే దవాఖానకు పోతా అంటూ ఓ పారిశుద్ధ్య కార్మికుడు ఆవేదన వ్యక్తంచేశాడు. వికారాబాద్ మండల పరిధిలోని ఎర్రపల్లికి చెందిన సీహెచ్ రాములు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. నెలకు రూ.9500తో కుటుంబాన్ని పోషించుకునే వాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు రావడంలేదు. బుధవారం రాములుకు జ్వరం రావడంతో దవాఖానకు వెళ్లాలని, డబ్బుల కోసం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాడు. అధికారులు వచ్చి డబ్బులు ఇస్తే దవాఖానకు పోయి చూపించుకోవాలని ఆశతో వచ్చాడు. పంచాయతీ కార్యదర్శి వచ్చి త్వరలో జీతాలు వస్తాయని చెప్పడంతో, ఆరు నెలలుగా జీతాలు రావడం లేదంటూ కన్నీరు పెట్టుకున్నాడు. ప్రభుత్వం స్పందించి జీతాలు వేయాలని వాపోయాడు.

వేతనం రాక పంచాయతీ ఉద్యోగి ఆత్మహత్య

అల్లాదుర్గం, మార్చి 26: జీపీ కార్యాలయంలో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న ఓ యువకుడు వేతనం రాక ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గంకు చెందిన బోయిని కుమార్ (28) గ్రామ పంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడగా ఈ నెల 21న అర్ధరాత్రి తన ఇంటిలో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఉస్మానియాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం చెందాడు. మృతుడి సోదరుడు బోయిని పోచయ్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

భూ తగాదాలో సీఐ జోక్యం

- ఒంటరి మహిళపై అక్రమకేసు
- రౌడీషీట్ ఓపెన్ చేస్తానంటూ బెదిరింపులు
- భూ ఆక్రమణదారులకు పోలీసుల వత్తాసు
- మహిళా కమిషన్‌కు వరంగల్ మహిళల ఫిర్యాదు

మహిళాకమిషన్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత మాట్లాడుతున్న టేకులమ్మ, రత్నమేరి

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చ్ 26 (నమస్తే తెలంగాణ): కాకతీయయూనివర్సిటీ సీఐ రవికుమార్ తమపై అక్రమంగా కేసులు పెడుతూ వేధిస్తున్నారని, సివిల్ తగాదాలో తలదూర్చి బాధితమహిళలపై రౌడీషీట్ ఓపెన్ చేస్తానంటూ బెదిరిస్తున్నారని హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం రెడ్డిపురం గ్రామానికి చెందిన టేకులమ్మ, రత్నమేరీ ఆరోపించారు. బుధవారం వారు రాష్ట్ర మహిళాకమిషన్‌లో బుధవారం వారు సీఐ రవికుమార్‌పై ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తమ గ్రామ శివారులో సర్వేనంబర్ 126లో ఎకరం భూమి కోసం ఇరువర్గాల మధ్య కోర్టులో సివిల్ కేసు విచారణ జరుగుతున్నది. ఈ నెల 18న రజనీకర్‌రెడ్డి అనే వ్యక్తి మరి కొంతమందితో వచ్చి ఆ స్థలంలో తిష్టవేశారని, అడ్డుకునేందుకు వెళ్లిన రత్నమేరీని దుర్భాషలాడుతూ దాడికి యత్నించారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే అండ చూసుకొని రజనీకర్‌రెడ్డి 2024 మే నుంచి తమ భూమిపై కన్నేశారని తెలిపారు. గత సంవత్సరం ఆగస్ట్‌లో స్థలం చుట్టూ ఉన్న ప్రహరీగోడను, అందులో కట్టిన రూమ్‌ను కూల్చేశారని, ఈ ఏడాది ఫిబ్రవరి 24న అక్కడ ఉన్న సీసీ కెమెరాల చోరీ జరిగిందని, ఈ నెల 18న స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆమె వివరించారు. ఈ మూడు సందర్భాల్లోనూ తాము ఒంటరి మహిళలమని, తమపై దాడులు చేస్తున్నారంటూ పోలీసులు ఆశ్రయించే ప్రయత్నం చేస్తే తిరిగి తమపైనే కేసులు పెడుతున్నారంటూ వాపోయారు. ఈ నెల 18న తమ స్థలంలోకి రజనీకర్‌రెడ్డి తన మనుషులతో వచ్చి దౌర్జన్యం చేయబోతే తాను కేయూ సీఐ రవికుమార్‌కు ఫోన్ చేశానని చెప్పారు. స్థలం దగ్గరకు వెళ్లి 100కు డయల్ చేయాలని అప్పుడు చర్యలు తీసుకుంటానని సీఐ చెప్పారని అన్నారు. సీఐ చెప్పిన విధంగానే తాము స్థలం వద్దకు వెళ్లే సరికి అక్కడ కొంతమంది ఉన్నారని, వారిలో ఒకరు తాను ఆర్ఐనని చెప్పారని తెలిపారు. ఆక్రమణదారులు, ఆర్ఐ వెళ్లిపోయిన తరువాత పోలీసులు వచ్చారని తెలిపారు. తమ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించినవారు తమను అసభ్యంగా దూషించారని తెలుపుతూ ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఎవరూ స్పందించలేదని అన్నారు. దీంతో తాము మరోసారి 100కు డయల్ చేశామని చెప్పారు. దీంతో ఈసారి పీఎస్‌లో తమ ఫిర్యాదు తీసుకున్నారని, కానీ తనపైనే ఎఫ్ఐఆర్ చేశారని రత్నమేరి వాపోయారు. అదేమని అడిగితే ఆర్ఐ మీద తాను దాడిచేశానంటూ అన్యాయంగా కేసు పెట్టారని తెలిపారు.ఈ విషయంలో కేయూ సీఐ అత్యుత్సాహం చూపించారని అన్నారు. ఒంటరి మహిళలమైన తమకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు తమపై దాడిచేస్తున్నవారికి వత్తాసు పలుకుతున్నారని, ఈ విషయంలో తనపై రౌడీషీట్ ఓపెన్ చేస్తానంటూ బెదిరిస్తున్నారని రత్నమేరి మీడియాకు వివరించారు. ఈ వ్యవహారంలో తనకు న్యాయం చేసి తమపై అక్రమంగా కేసులు పెడుతూ వేధిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రమహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు రాష్ట్రపతికి, జాతీయమహిళాకమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

ఏపీకి ఎన్నో నీటివనరులు

- గోదావరి నుంచి కేడీఎస్‌కు జలాల మళ్లింపు
- కృష్ణా బేసిన్ అవతలికి 323 టీఎంసీలు
- ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు
- తదుపరి విచారణ ఏప్రిల్ 15కు వాయిదా

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రాజెక్టులకు అదనపు నీటివనరులు అందుబాటులో ఉన్నాయని, అలా పొదుపు చేసిన జలాలను తెలంగాణకు కేటాయించవచ్చని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ నివేదించింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెక్షన్-3 మార్గదర్శకాలకు అనుగుణంగా రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి సంబంధించి ఢిల్లీలో గత రెండు రోజులుగా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ నిర్వహిస్తున్న విచారణ బుధవారం కూడా కొనసాగింది. ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్ కుమార్, సభ్యులు జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర ఎదుట తెలంగాణ సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలను కొనసాగించారు. తెలంగాణ నీటి అవసరాలను ట్రిబ్యునల్‌కు వివరించారు. పునఃపంపిణీ వల్ల ఏపీ తన నీటి వాటాను కోల్పోదని, రెండు రాష్ట్రాల మధ్య సమానమైన, న్యాయమైన రీతిలోనే జలాలను పంపిణీ చేయాలని తెలంగాణ కోరుతున్నదని స్పష్టం చేశారు. తాత్కాలిక వాటా కింద ఏపీకి కేటాయించిన 512 టీఎంసీల్లో 323 టీఎంసీలను అంతర్గత ఏర్పాటులో భాగంగా అవతలి బేసిన్‌కు మళ్లిస్తున్నదని, బేసిన్ లోపల 189 టీఎంసీలను మాత్రమే వినియోగిస్తున్నదని తెలిపారు. 75% డిపెండబుల్ జలాల్లో తెలంగాణకు 555 టీఎంసీలను కేటాయించడం వల్ల ఏపీపై ఎలాంటి ప్రభావం ఉండబోదని చెప్పారు. ఏపీ ప్రాజెక్టులకు అదనపు వనరులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ.. కృష్ణా డెల్టా వ్యవస్థ (కేడీఎస్)కు కాలువల ద్వారా 43.2 టీఎంసీలు, పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మళ్లించడం ద్వారా 80 టీఎంసీలతోపాటు పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నుంచి కూడా గోదావరి జలాలను కేడీఎస్‌కు మళ్లిస్తున్నదని వివరించారు. తీవ్రమైన లోటు ఏర్పడిన 2023-24 నీటి సంవత్సరంలో కూడా కేడీఎస్ దాదాపు 125 టీఎంసీలను ఉపయోగించుకుందని వెల్లడించారు. ఆ సమయంలో శ్రీశైలం వద్ద ఇన్‌ఫ్లోలు కేవలం 145టీఎంసీలు మాత్రమేనని, 125 టీఎంసీల్లో పట్టిసీమ లిఫ్ట్ ద్వారా దాదాపు 40 టీఎంసీల గోదావరి జలాలను కేడీఎస్‌కు మళ్లించారని తెలిపారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు గ్రావిటీ ద్వారా నీటిని అందించేందుకు 150 టీఎంసీ సామర్థ్యంతో శ్రీశైలం ఎడమ గట్టు కాలువను రూపొందించారని, ఆ మేరకు కేటాయింపుల కోసం ట్రిబ్యునల్-1ను ఉమ్మడి ఏపీ సర్కారు ఒత్తిడి చేయలేదని, బేసిన్ అవతలి ప్రాజెక్టులకు కేటాయింపుల కోసం పట్టుబట్టిందని వివరించారు. తాజా సెషన్‌లో 3 రోజులపాటు కొనసాగిన విచారణ బుధవారం ముగిసింది. దీంతో తదుపరి సెషన్ విచారణను ఏప్రిల్ 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్టు ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేశ్ కుమార్ ప్రకటించారు.

భద్రాచలం పట్టణంలో కుప్పకూలిన ఆరు అంతస్తుల భవనం

కుప్పకూలిన భవనం వద్ద సహాయ చర్యలు చేపట్టిన సిబ్బంది

భద్రాచలంలో కుప్పకూలిన ఆరంతస్థుల భవనం

- నిర్మాణంలో ఉండగానే ఘటన
- శిథిలాల్లో మేస్త్రీలు, కూలీలు?
- కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో సహాయక చర్యలు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 26 (నమస్తే తెలంగాణ): భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం బుధవారం కుప్పకూలింది. శిథిలాల్లో మేస్త్రీలు, కూలీలు చిక్కుకుపోవడం ఘటన తీవ్రతను మరింత పెంచింది. భద్రాచలం పట్టణంలోని రామాలయం సమీపంలో ఓ పాత భవనంపై శ్రీపతి నేషనల్ సేవా ట్రస్టు పేరిట మరో ఐదంతస్తులు నిర్మిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం కూడా పనులు కొనసాగుతుండగా, భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. శిథిలాల్లో ఎంతమంది చిక్కుకున్నారనే విషయం మాత్రం తేలడం లేదు. మరోవైపు ఇద్దరు మాత్రమే పనుల్లో ఉన్నట్టు భవన యజమాని, అధికారులు చెప్తున్నారు. భద్రాచలానికి చెందిన పడిశాల ఉపేందర్ రావు, చల్లా కామేశ్‌తో పాటు మరికొందరు పనుల్లో ఉన్నట్టు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. శిథిలాల తొలగింపు పనులు చేపట్టారు. ఈ క్రమంలో కొన్ని అరుపులు వినిపించినట్టు స్థానికులు వెల్లడించారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, స్థానిక అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆరు జేసీబీలు, భారీ క్రేన్లతో ఐరన్ కట్టర్లను ఉపయోగించి రెస్క్యూ బృందాలు శిథిలాలను తొలగిస్తున్నాయి. భవనం కూలిందనే విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలి వద్ద గుమిగూడారు. నిర్మాణం నాసిరకంగా ఉండటమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెప్తున్నారు. కాగా ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో పాతభవనంపై ఐదంతస్తుల నిర్మాణం చేపడితే అధికారులెందుకు పట్టించుకోలేదనే ప్రశ్న తలెత్తుతున్నది. ఈ భవనంపై ఇటీవలే గిరిజన సంఘాలు అధికారులకు ఫిర్యాదు చేశాయి. ఇంతలోనే ప్రమాదం జరిగింది.

నా పేరు కామేశ్.. నన్ను కాపాడండి

కూలిపోయిన భవనం శిథిలాల నుంచి ఓ వ్యక్తి ఆర్తనాదాలు రెస్క్యూ, ఫైర్ సిబ్బందికి వినిపించాయి. 'నా పేరు కామేశ్.. నన్ను కాపాడండి' అంటూ అరిచినట్టు వినిపించింది. దీంతో ఆ వ్యక్తిని కాపాడేందుకు లైట్ల వెలుతురు మధ్య పైపుల ద్వారా ఆక్సిజన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం పంపించారు.

ఏయ్..టంగ్ కంట్రోల్ చెయ్!

బీఆర్ఎస్ నాయకులపై యాదగిరిగుట్ట ఏసీపీ రమేశ్‌కుమార్ దురుసు ప్రవర్తన

ఫిర్యాదు చేసేందుకు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బీఆర్ఎస్ నాయకులతో దురుసుగా వ్యవహరిస్తున్న ఏసీపీ రమేశ్‌కుమార్

యాదగిరిగుట్ట, మార్చి 26: 'ఏయ్ ఏమనుకుంటున్నవ్.. టంగ్ కంట్రోల్ చెయ్.. నేను ఆఫీసర్‌ను' అంటూ యాదగిరిగుట్ట ఏసీపీ రమేశ్‌కుమార్.. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులపై దురుసుగా ప్రవర్తించారు. 'ఇది పోలీస్‌స్టేషన్.. గుంపులుగా పార్టీ కండువాలు వేసుకుని వస్తారా' అంటూ సీరియస్ అయ్యారు. కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ ముక్కర్ల మల్లేశ్‌తో పాటు ఆ పార్టీ నాయకులు తమను నిందించడంతోపాటు బట్టలుడదీసి కొడుతామని వ్యాఖ్యలు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. సీఐ రమేశ్‌ను కలిసి ఫిర్యాదు చేసి సమస్యను వివరిస్తుండగా, ఏసీపీ రమేశ్‌కుమార్ జోక్యం చేసుకున్నారు. 'ఫిర్యాదు ఇచ్చి వెళ్లండి.. ఇంతమంది రావద్దు' అంటూ హుకూం జారీ చేశారు. 'ఈ రోజు అసెంబ్లీలో ముఖ్యమైన రోజు' అంటూ అక్కడి పరిస్థితికి సంబంధం లేని వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు స్పందిస్తూ.. మేం ఫిర్యాదు చేసేందుకే వచ్చాం.. స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదును వివరిస్తున్నాం అని బదులివ్వడంతో ఏసీపీ ఆగ్రహంతో ఊగిపోయారు. 'నోరు మూసుకోండి' అంటూ చేతులతో సైగలు చేశారు. 'ఇది పోలీస్ స్టేషన్.. మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడొద్దు' అంటూ హెచ్చరించారు. దీంతో విసిగిపోయిన బీఆర్ఎస్ శ్రేణులు మీరు పోలీస్ అధికారిగా ప్రవర్తించడం లేదు.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని మండిపడటంతో అక్కడి నుంచి తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు.

ఏసీపీని సస్పెండ్ చేయాలి: బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటయ్య

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రశ్నిస్తే తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వస్తే దురుసుగా ప్రవర్తించిన ఏసీపీని వెంటనే సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఏసీపీ రమేశ్‌కుమార్ ప్రభుత్వాధికారిగా కాకుండా కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఫిర్యాదును స్వీకరించిన పట్టణ సీఐ రమేశ్ సర్దిచెప్పేందుకు యత్నించినా పట్టించుకోకుండా అడ్డగోలుగా ప్రవర్తించారని వాపోయారు. త్వరలో డీసీపీ, సీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

మంచినీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామంలో 10 రోజులుగా మంచినీళ్లు రావడం లేదని మహిళలు రోడ్డెక్కారు. బుధవారం ఖాళీ బిందెలతో సిద్దిపేట-హనుమకొండ రహదారిపై రాస్తారోకో చేశారు. సుమారు గంటసేపు బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మహిళల ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. పది రోజులుగా మంచినీళ్లు రాకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ మహిళలు మండిపడ్డారు. - కోహెడ

భగీరథ రాక.. మంచినీటి కష్టాలు

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీవాసులు వారం రోజులుగా భగీరథ నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతిపంపులు, బోర్లు పని చేయకపోవడంతో తీవ్ర నీటి కొరత ఏర్పడింది. దీంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి తోపుడు బండ్లు, ఎడ్ల బండ్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. - తాంసి

వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యం ఇవ్వాలి

జీపీవో ఉద్యోగాలలో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిర్వహించారు. ప్రభుత్వం తమ ఆకాంక్షను నెరవేర్చకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీఆర్ఏ జేఏసీ చేపట్టిన ధర్నాకు వామపక్షాల నేతలు, ప్రజాసంఘాల కార్యకర్తలు తరలివచ్చారు. -హైదరాబాద్